క్లుప్తంగా

పోస్టులు భర్తీ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి నాగ రాముడు కోరారు. శుక్రవారం ఈ మేరకు ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రూప్–1, 2 అభ్యర్థులకు వయో పరిమితి పెంచాలని, నిరుద్యోగులకు రూ.3వేలు భృతి ఇవ్వాలని, వైద్య ఆరోగ్య శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.అంజి, రవి, విష్ణు, స్వామి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

శిరివెళ్ల: నెల రోజుల్లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ హరిగోపాల్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష చేపట్టారు. సచివాలయాల వారీగా ఇళ్ల మంజూరు, వాటి పురోగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆరా తీశారు. తుది దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. మండలానికి 1,580 ఇళ్లు మంజూరు కాగా 713 పూర్తి కాగా, మరో 96 తుది దశలో ఉన్నాయని వివరించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఏఈ నాగ శేఖర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

రుద్రవరం: మండలంలోని 60 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు,బాలింతలు,చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం సాగుతోంది.18 రోజులుగా అంగన్‌వాడీ వర్కర్లు నిరసనలో పాల్గొంటున్నారు.దీంతో కేంద్రాలకు వచ్చే వారికి పౌష్టికాహార పంపిణీలో ఇబ్బందులు లేకుండా చేసేందుకు అధికారులు సచివాలయ ఉద్యోగులు, ఇతరులను ఇన్‌చార్జులుగా నియమించారు. శుక్రవారం బీరవోలు అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతకు కేంద్ర ఇన్‌చార్జ్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరెడ్డి సరుకులు పంపిణీ చేశారు. పంపిణీని పర్యవేక్షిస్తున్నట్లు సూపర్‌వైజర్ లక్ష్మీదేవి తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరులో ఈనెల 11,12తేదీల్లో జరిగిన అండర్–17 పుట్‌బాల్ పోటీల్లో ఊర్పపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని తస్లీమ్ బ్రాంజ్ మెడల్ సాధించిందని హెచ్‌ఎం మాధురి శుక్రవారం తెలిపారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడి ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): బీజేపీ నంద్యాల పట్టణ అధ్యక్షుడిగా కొట్టె చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక పార్టీ అసెంబ్లీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రాన్ని అందజేశారు.

వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వారికి వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. ముందుగా చక్రాకారంలో 108 కలశాలకు కలశ స్థాపన గావించి ముఖ్య నదుల నుంచి తీసుకొచ్చిన జలాన్ని నింపి విశేష పూజలు చేపట్టారు.

ధర్మ సమ్మేళనానికి ఆహ్వానం

నంద్యాల(అర్బన్): సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న ఉయ్యాలవాడలో నిర్వహించనున్న హిందూ ధర్మ సమ్మేళనంలో పాల్గొనాలని ఫౌండేషన్ నంద్యాల నగర కన్వీనర్ చింతలపల్లె వాసు, ఆళ్లగడ్డ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ నరసింహులు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి

నంద్యాల(న్యూటౌన్): సంప్రదాయ కళలతో పాటు రాయలసీమ ప్రాంత కళలను ప్రోత్సహించాలని చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ రాకేష్‌రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక టౌన్‌హాల్‌లో బాలోత్సవం కార్యక్రమం జరిగింది. ఇందులో 39 రకాల వేషధారణ, మట్టిబొమ్మలు, క్విజ్, వ్యాసరచన పోటీలు, కోలాటం, శాస్త్రీయ నృత్యం తదితర కార్యక్రమాలు జరిగాయి. 3వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు రక్షణ కవచంలా భూ రీ సర్వే



రైతులతో మాట్లాడుతున్న మల్లయ్య

దొర్నిపాడు: భూ రీ సర్వే రైతులకు భవిష్యత్‌లో రక్షణ కవచంలా పనిచేస్తుందని మండల సర్వేయర్ మల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో భూ రీసర్వే పనులు పూర్తి కావడంతో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరవి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 3175.285 ఎకరాలకు భూ రీసర్వే చేశామన్నారు. ఏమైనా తప్పులు ఉన్నట్లయితే తగిన ఆధారలతో సంప్రదించాలని సూచించారు. అనంతరం రీసర్వే వివరాలను సచివాలయం బోర్డుపై ప్రదర్శించారు. గ్రామ సర్వేయర్ గంగాధర్, సర్పంచ్ శివ రామిరెడ్డి, ఉప సర్పంచ్ మహేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి కనిపించదా?

వాగలమర్రి: గడప గడప నిధులతో మండల కేంద్రంలో చేపట్టిన సీసీరోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులు ప్రతిపక్ష నాయకులకు కనిపించవా అని వైస్ ఎంపీపీ ముల్లా.రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు చక్రం షబ్బీర్ ప్రశ్నించారు. స్థానిక 1వ సచివాలయం, 2వ వార్డులో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు, తీగల మరమ్మతు పనులను శుక్రవారం వారు పర్యవేక్షించారు.

మార్గం సుగమం



- పల్లెల్లో జోరుగా అంతర్గత రోడ్ల నిర్మాణాలు
- శిరివెళ్ల మండలంలో నాలుగేళ్లలో వంద రోడ్ల ఏర్పాటు
- పనులకు రూ.6కోట్ల వెచ్చింపు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సీసీ రోడ్ల నిర్మాణాల వివరాలు..

పంచాయతీ	రోడ్లు	ఖర్చు (రూపాయల్లో)
శిరివెళ్ల	30	2.50 కోట్లు
యర్రగుంట్ల	5	48 లక్షలు
గోవిందపల్లె	13	95 లక్షలు
జీనేపల్లె	4	19 లక్షలు
గంగవరం	4	17 లక్షలు
మహదేవపురం	6	18 లక్షలు
కామినేనిపల్లె	6	24 లక్షలు
గుంప్రమాన్‌దిన్నె	7	1.50 కోట్లు
బోయలకుంట్ల	7	30 లక్షలు



యర్రగుంట్లలో వేసిన సిమెంట్ రోడ్డు



శిరివెళ్లలో పూర్తయిన సీసీ రోడ్డు

శిరివెళ్ల: పల్లెల్లోని అంతర్గత రహదారులను గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో మట్టి రోడ్ల పైనే రాకపోకలు సాగుతున్నాయి. ఇక వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచి బురదమయమై స్థానికుల అవస్థలు వర్ణనాతీతం. అయినా గత పాలకుల కళ్లకు వారి బాధలు కనిపించలేదు. దీంతో ఏళ్ల గడుస్తున్నా దారి కష్టాలు కొనసాగుతున్నాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడంతో వారి ఇబ్బందులకు పరిష్కారం లభించింది. మట్టి రోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చి రాకపోకలకు అవస్థలు లేకుండా మార్గం సుగమం చేసింది. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి సమస్యలను తెలుసుకొని పరిష్కారం చూపడంతో వారికి ఇక్కట్లు తప్పాయి. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జెడ్పీ, ప్రభుత్వ, ఉపాధి పథకం నిధులతో గ్రామ పంచాయతీల్లో రోడ్ల నిర్మాణాలు జరిగాయి. ఇంకా గడప గడపకు మన ప్రభుత్వ నిధులతో రోడ్ల నిర్మాణాలు చకచకా ముందుకు సాగుతున్నాయి. ఈ నాలుగున్నర ఏండ్లలో రూ. దాదాపు 6 కోట్లతో వంద అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణాలు పూర్తి కాగా. మరిన్ని పనులు జరుగుతున్నాయి.

హామీ ఇచ్చిన నెలకే రోడ్డు..

మండలంలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రానాద్‌రెడ్డి పర్యటన పూర్తయింది. కార్యక్రమంలో భాగంగా 16 గ్రామ సచివాలయాల్లో ప్రజలు తమకు సిమెంట్ రోడ్లు కావాలని అడిగారు. ఇచ్చిన హామీ మేరకు ఆయా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేయించారు. హామీ ఇచ్చిన నెలలోపే రోడ్డు పనులు చేపడుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇంత త్వరగా పరిష్కారం చూపడం ఇంతకుముందెన్నడూ చూడలేదని పేర్కొంటున్నారు.



గోవిందపల్లె ఎస్సీ కాలనీకి సిమెంట్ రోడ్డు వేస్తున్న దృశ్యం

రోడ్ల పనులు జరుగుతున్నాయి



వివిధ నిధులతో మండలంలో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చురుకుగా జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పర్యటించినప్పుడు ఆయన దృష్టికి వచ్చిన ప్రాంతాల్లో రోడ్లు వేశాం. కొన్నిచోట్ల పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం యర్రగుంట్ల, శిరివెళ్ల, గోవిందపల్లె, గుంప్రమాన్‌దిన్నెలో రోడ్ల పనులు వేగంగా చేస్తున్నాం.

– రవికుమార్, పీఆర్ ఏఈ

35 ఏళ్లకు రోడ్డు వేశారు



మాది యర్రగుంట్ల గ్రామం. మా వీధిలో 35 ఏళ్లకు సిమెంట్ రోడ్డు వేశారు. ఇంతకు ముందు సిమెంట్ రోడ్డు వేయాలని ఎన్నికల ముందు అడుగుతూ వచ్చాం. అందరూ ఓట్లు వేయించుకున్నారు కానీ రోడ్డు మాత్రం వేయలేదు. ఈ ప్రభుత్వంలో రోడ్డు వేశారు. రోడ్డు ఏర్పాటు చేయడంతో మాకు బురద కష్టాలు తప్పాయి.

– పూల మాబాషా యర్రగుంట్ల

మట్టి రోడ్డుపై ఇబ్బందులు పడ్డాం



మాది శిరివెళ్ల 7వ వార్డు. మా వీధిలో 65 ఇళ్లు ఉన్నాయి. మట్టి రోడ్డు కావడంతో వానా కాలంలో నడవడానికి ఇబ్బందిగా ఉండేది. ఎమ్మెల్యే మా వీధిలో పర్యటించి సమస్యలున్నాయా అని ఆయనే అడిగారు. సిమెంట్ రోడ్డు కావాలని కోరాం. హామీ ఇచ్చిన నెల రోజుల్లోనే రోడ్డు వేయించారు. మాకు సంతోషంగా ఉంది.

– ఖుద్దూష్, శిరివెళ్ల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మహిళలతో మాట్లాడుతున్న గంగుల అవంతిరెడ్డి

ఆళ్లగడ్డ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు గంగుల అవంతిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కోవెలకుంట రోడ్డులో శుక్రవారం రాత్రి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, సోముల రాధ, చక్రపాణి, రమేష్, న్యాయవాది సరిత, ఆజాద్ ఉన్నారు.

గిరిజనులు జీవనోపాధులను పెంచుకోవాలి



కుట్టు మిషన్లు అందజేస్తున్న డీఎఫ్ఓ వినీత్‌కుమార్

ఆళ్లగడ్డ: గిరిజన మహిళలు జీవనోపాధులను పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా ఫారెస్ట్ అధికారి వినీత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అహోబిలంలో గిరిజన కుటుంబాలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించిన కుట్టుమిషన్లతో జీవనోపాధిని పెంచుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతినాయుడు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మూర్తు జావలి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ముక్తార్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



కొండుపల్లె ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



రుద్రవరంలో క్రికెట్ పోటీలను పరిశీలిస్తున్న అధికారులు



నందమూరినగర్‌లో కబడ్డీ పోటీలకు సిద్ధమవుతున్న మహిళలు



కానాలలో షటిల్ ఆడుతున్న యువకులు



దొర్నిపాడులో క్రికెట్ ఆడుతున్న యువకులు

ఉయ్యాలవాడ : గ్రామ స్థాయి నుంచే యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహిస్తుందని ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. నాలుగవ రోజు శుక్రవారం సచివాలయాల పరిధిలో కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. క్రీడాకారులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, పంచా యతీ కార్యదర్శులు సుచరిత,నూర్‌బాషా పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్రికెట్ పోటీలను ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ,ఎంఈఓ శ్రీలక్ష్మి తదితరులు పర్యవేక్షించారు.

గోస్పాడు: మండలంలోని దీబగుంట్ల, యాళ్లూరు, గోస్పాడు క్రీడా మైదానాల్లో బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ అనసూయ, తహసీల్దార్ విజయశేఖర్, ఎంఈఓలు అబ్దుల్‌కరీం, సురేంద్ర పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): పట్టణంతో పాటు గ్రామాల్లో ఆడుదాం ఆంధ్ర పోటీలు కొనసాగుతున్నాయి. స్థానిక నందమూరినగర్ సచివాలయం–1 పరిధిలో మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. టీం–1పై టీం–2 29–21 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. వార్డు ఇన్‌చార్జ్ యూసుఫ్, కార్యదర్శి వెంకటసుధాకర్, వార్డు సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు. కానాల, చాపిరేవుల గ్రామాల్లో నిర్వహించిన కబడ్డీ, క్రికెట్, షటిల్ పోటీలు హోరాహోరీగా సాగాయి.

దొర్నిపాడు: క్రీడలు ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుతాయని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు.ఆడుదాం ఆంధ్రాలో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని గుండుపాపల గ్రామంలో ఖోఖో పోటీలను ప్రారంభించారు. అలాగే దొర్నిపాడులో క్రికెట్ పోటీలను పీడీఓ దేవేంద్ర, సరళ, ఉపాధ్యాయులు చెన్నయ్య, రవిప్రకాష్ ప్రారంభించారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఎంఈఓ రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు నాగార్జున, మహేష్, సచివాలయ కన్వీనర్ రాముడు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు



సర్వాయిపల్లెలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల



అధికారులు, ప్రజాప్రతినిధుతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఉయ్యాలవాడ : ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా జగనన్న పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆర్.జంబులదిన్నె సచివాలయ పరిధిలోని సర్వాయిపల్లె గ్రామంలో జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మిదేవి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, సర్పంచ్ ఉమ, గ్రామ నాయకులు సరాబు దస్తగిరి, గిరిధర్‌బాబుతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న వారికి స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్ అందజేసి సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో సచివాలయం పరిధిలో 4,758 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.13,91,74,296 వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. పరోక్షంగా 1,531 మందికి రూ. 3,63,03,829 ప్రభుత్వం జమ చేసిందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పల్లె గురుప్రసాద్‌రెడ్డి, నడిపెన్న, ప్రసాద్, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సత్తిగారి బాలిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు కపురం శ్రీనివాసరెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, కూలూరు రామకృష్ణారెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి విజయదీప్తి పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లలో ప్రగతి పరుగులు

దొర్నిపాడు: గడచిన నాలుగున్నరేళ్లలో మండలంలో అభివృద్ధి పనులు పరుగులు తీశాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యలయంలో కొండాపురం సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగియడంతో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహిచారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు సంక్షేమం ప్రభుత్వం 131.46, అభివృద్ధి పనుల కోసం రూ.49.49 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం అర్జునాపురంలో రూ.5లక్షలు, అమ్మిరెడ్డినగరంలో రూ.5లక్షలు, భాగ్యనగరంలో రూ.10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు అలాగే చాకరాజు వేముల–డబ్ల్యూ గోవిందిన్నె బీటీ రోడ్డును రూ.2కోట్లతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శివారెడ్డి, నాయకులు పయిడేల శివరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, సర్పంచులు మాధవీలత, మాధవీ, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటసుబ్బయ్య, పీఆర్ డీఈ లక్ష్మీనరసింహుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, ఏఓ సునీత పాల్గొన్నారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిలకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేశారని పోలీసు సిబ్బంది శుక్రవారం తెలిపారు. వివరాలు.. పట్టణానికి చెందిన తలారి ధనుష్, షేక్ రియాజ్ సాయిబాబానగర్ వద్ద రోడ్డుపై వెళ్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా ధనుష్‌కు ఐదు రోజులు, షేక్ ఫయాజ్‌కు రెండు రోజులు శిక్షను ఖరారు చేశారని వివరించారు.

12 వరకు కోర్టు విధుల బహిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్టు 2022 చట్టం ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోపై న్యాయవాదులు జనవరి 12వ తేదీ వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రవీంద్రకుమార్, కార్యదర్శి ప్రతాపరెడ్డి శుక్రవారం తెలిపారు. కక్షిదారులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

ఎక్స్‌గ్రేషియా అందజేత

కర్నూలు: నంద్యాల పట్టణంలోని రైతునగరం ప్రాంతానికి చెందిన పబ్లిక్ హెల్త్ వర్కర్ కాశమ్మ ఇటీవల మృతి చెందడంతో ప్రభుత్వం ఆమె కుటుంబానికి రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఇందుకు సంబంధించిన చెక్కును మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ రవిచంద్రారెడ్డి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఎంహెచ్ఓ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

కర్నూలు: చాగలమర్రిలోని 3వ సచివాలయానికి చెందిన ఉచ్చుసాగారి అహ్మద్ హుసేన్ (45) అనే ఆటో డ్రైవర్ మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో మృతుడి భార్య ఉమేరాకు వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10వేల నగదును గ్రామ సర్పంచ్ తులసమ్మ శుక్రవారం అందజేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన దృశ్యం

- టీడీపీ నుంచి 250 మంది వైఎస్సార్‌సీపీలో చేరిక

నంద్యాల: కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ అండగా ఉంటున్నామని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తన స్వగృహంలో నాగరాజు, నాయక్, దీపక్‌నాయక్ ఆధ్వర్యంలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన 250 మంది టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధిని చూసి టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జయప్రకాష్‌రెడ్డి, 38వార్డు ఇన్‌చార్జ్ టీవీ రమణ, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, పార్టీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ శంకర్‌నాయక్, కౌన్సిలర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

నంద్యాల టౌన్: జిల్లా వ్యాప్తంగా గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ట్రైబల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు సికేల్ సెల్, అనీమియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి గిరిజన ప్రాంతాల్లోని వైద్యాధికారులు సచివాలయ ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు, రక్త హీనత పరీక్షల స్క్రీనింగ్ టెస్టులపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కాంతారావు నాయక్, ఏఓ చంద్రశేఖర్, డెమో రవీంద్ర నాయక్, డాక్టర్ శ్రీజ పాల్గొన్నారు.

234 గ్రామాల్లో సమగ్ర రీ సర్వే

నంద్యాల: జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం కింద 234 గ్రామాల్లో సమగ్ర రీ సర్వే జరిపి భూ హక్కు పత్రాలను సంబంధిత రైతులకు అందజేశామని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో 11 గ్రామాల్లోని 15,670 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే, గ్రౌండ్ ట్రూథింగ్ పనులు నిర్వహించి 19,155 సరిహద్దు రాళ్లు పాతామన్నారు. రెండవ విడతలో 73 గ్రామాల్లోని 1,53,998 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే, గ్రౌండ్ ట్రూథింగ్ పనులు నిర్వహించి 87,855 సరిహద్దు రాళ్లు వేశామని, మూడవ విడతలో 150 గ్రామాల్లో 5,54,001 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే, గ్రౌండ్ ట్రూథింగ్ పనులు నిర్వహించి ఇప్పటి వరకు 13,794 సరిహద్దు రాళ్లు పాతామని పేర్కొన్నారు.

రీసర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ శామూన్

నంద్యాల: జిల్లాలో మూడవ విడతలో చేపట్టిన భూ రీ సర్వే ప్రక్రియ పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రీ సర్వే, ఆర్ఓఆర్, మ్యుటేషన్ సేవలు, భూ సేకరణ – పరాయీకరణ, వ్యవసాయ భూముల కేటాయింపు తదితర నిర్దేశిత రెవెన్యూ లక్ష్యాల సాధనపై జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే మూడవ విడత కార్యక్రమాన్ని వేగవంతం చేసి ఈనెల 15వ తేదీలోగా ఫైనల్ ఆర్ఓఆర్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తయి సర్వే నంబర్లలోని కొలతల్లో తేడాలొస్తే సంబంధిత భూ యజమానులు ఏడాదిలోపు దరఖాస్తులు సమర్పించుకునేలా రైతుల్లో భరోసా కల్పించాలన్నారు. భూ హద్దుల కొలతలపై చిన్నచిన్న అభ్యంతరాలు వ్యక్తం చేస్తే వాటిని కూడా పరిష్కరించేందుకు తహసీల్దార్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రీ సర్వే ప్రక్రియకు సంబంధించి గ్రౌండ్ ట్రూథింగ్, ఫైనల్ ఆర్ఓఆర్, స్టోన్ ప్లాంటేషన్‌పై రోజు వారీ లక్ష్యాన్ని నిర్దేశించుకొని పూర్తి చేయాలని కోరారు. జేసీ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియపై సీసీఎల్ఏ నుంచి ప్రతిరోజు సమీక్షిస్తున్నారని ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ఆర్డీఓలు, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందన తరహాలోనే రీ సర్వే పై వచ్చిన గ్రీవెన్సెస్‌ను కూడా రిజిస్టర్లో నమోదు చేసి 15 రోజుల్లోగా పరిష్కరించాలని తెలిపారు. డీఆర్ఓ పుల్లయ్య, ఏడి సర్వే లాండ్స్, సంబంధిత డివిజన్, మండలాల ఆర్డీఓలు, తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఉజ్వల పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు

ఉయ్యాలవాడ : ఉజ్వల పథకం ద్వారా రేషన్ కార్డు కలిగిన మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు ఈఓపీఆర్‌డి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, సర్పంచ్ మేకల ఓబులేస్ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప్ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. అలాగే పోస్టాఫీసు పథకాలను కూడా తెలియజేశారు. ఎంపీటీసీ సభ్యులు గగ్గెర వెంకటేశ్వర్లు, ఏపీఓ రవిప్రకాష్, ఏఓ రాజేంద్రకుమార్, పీఎస్ జయరామిరెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

రుద్రవరం: మండలంలోని ఎల్లావత్తుల,బీరవోలు గ్రామాల్లో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు మొదలయ్యాయి. కొద్ది రోజుల క్రితం ఎల్లావత్తుల గ్రామ సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన సమయంలో ఆయా గ్రామల్లో సీసీ రోడ్లు కావాలని అడగడంతో ఆయన స్పందించారు. ఎల్లావత్తులలో సచివాలయానికి వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మించేందుకు రూ.13లక్షలు, బీరవోలు తాగునీటి పథకం వైపు వెళ్లే దారితో పాటు మరో దారిలో సీసీ రోడ్డుకు రూ.7లక్షలు కేటాయించారు. దీంతో శుక్రవారం పనులు ప్రారంభించారు. బీరవోలు సర్పంచు ఏలిషా,వైఎస్సార్‌సీపీ నాయకులు శేషు,రాజ్‌కుమార్ ఉన్నారు.